ప్రజాశక్తి

సోమవారం 15 ఏప్రిల్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రజా సమస్యల ప్రస్తావనేదీ ?



పాయకరావుపేటలో సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

- ఉక్కు పరిరక్షణపై స్పష్టతనివ్వని చంద్రబాబు
- ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలపై కప్పదాటు వైఖరి
- పాయకరావుపేట, గాజువాకల్లో చప్పగా సాగిన ప్రజాగళం

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో, పాయకరావుపేట, గాజువాక విలేకరులు

ఉమ్మడి విశాఖలోని పాయకరావుపేట, గాజువాకల్లో ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభల్లో ముఖ్యమైన ప్రజా సమస్యల ప్రస్తావన కానరాలేదు. నియోజకవర్గాల ప్రజలకు భరోసా లభించలేదు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపైనా చంద్రబాబు స్పష్టతనివ్వలేదు. అనకాపల్లి జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలపై కప్పదాటు వైఖరి ప్రదర్శించారు. రెండు సుగర్ ఫ్యాక్టరీలపై తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు తప్ప అధికారంలోకి వస్తే తెరిపిస్తామని హామీ ఇవ్వలేదు. మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీల విషయమై అంతకు ముందు మాట్లాడిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వంగలపూడి అనిత, సిఎం రమేష్ ప్రస్తావించలేదు. ఎన్ఎఒబి నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కారిస్తానని చెప్పిన చంద్రబాబు ఆ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. టిడిపి ప్రభుత్వం నుంచి ఈ సమస్యలు కొనసాగుతున్నా ఇప్పటికీ వారికి పరిష్కారం చూపలేదు. ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదు. నియోజకవర్గంలో హెటిరో, డెక్కన్ కెమికల్ కంపెనీల వ్యర్థాలతో దెబ్బతిన్న మత్స్యకారుల ఉపాధికి రక్షణ కల్పిస్తామనిగానీ, కంపెనీల కాలుష్యం నియంత్రణకు తీసుకోబోయే చర్యలపైగానీ హామీ ఇవ్వలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పరిశ్రమలు రావడం ద్వారా ఈ ప్రాంతం అభివద్ధి జరగాలని సాధారణ వ్యక్తిగా మాట్లాడారు తప్ప నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉండబోతుందో చెప్పలేదు. గతంలో ఇచ్చిన రాష్ట్ర స్థాయి సంక్షేమ పథకాలు వల్లె వేయడం తప్ప వెనుకబడ్డ జిల్లా, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చంద్రబాబు వద్ద ఉన్నట్లు కనిపించలేదు. చంద్రబాబు ప్రసంగంలో పసలేకనేమో వచ్చిన జనం, ఆయన ప్రసంగిస్తుండగా వెనుదిరిగారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన మోడీపై మిగతా 2లో..

రాయి కలకలం

జువాకలో ఆదివారం సాయంత్రం టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న 'ప్రజాగళం' సభలో ఆయన ప్రసంగిస్తున్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరాడు. సభా వేదిక దగ్గర గల బారికేడ్ల వద్దకు ఆగంతకుడు విసిరిన రాయితో కొద్ది క్షణాలు చంద్రబాబు ప్రసంగాన్ని ఆపారు. దీంతో పోలీసులు రాయి వచ్చిందని భావించిన సభా వేదికకు ఎడమ వైపునకు వెళ్లి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఈ సందర్భంగా బాబు ప్రసంగిస్తూ గతంలో తనపై బాంబులు పడితేనే భయపడలేదని రాళ్లు ఒక లెక్కా ? అని అన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

అంబేద్కర్‌కు ఘన నివాళి

వాడవాడలా జయంతి వేడుకలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు ఆదివారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వాడవాడలా సాగాయి. ఆ మహనీయున్ని స్మరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘన నివాళ్లర్పించారు. సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమాల్లో రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతినబూనారు (వార్తలు లోపలి పేజీల్లో..)

ఐదో రోజుకు గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

▶ వార్త 3లో..

సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

▶ వార్త 3లో..

జగన్‌పై దాడిని ఖండిస్తూ వైసిపి నిరసనలు

▶ వార్త 2లో..



కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారున్ని పరామర్శిస్తున్న నర్సింగరావు

బోటు ప్రమాద

క్షతగాత్రులకు సిహెచ్‌ఎన్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాకినాడ సమీపంలో ఇటీవల బోటు ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు ఆదివారం మిగతా 2లో..

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్ఎంవి బెంగళూరు - మాల్దా టౌన్, మైసూర్ - ముజఫర్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇవన్నీ దువ్వాడ స్టేషన్ మీదుగా వెళ్లనున్నాయి. ఈ క్రమంలో 06563 ఎస్ఎంవి బెంగళూరు - మాల్దా టౌన్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు ప్రతి ఆదివారం రాత్రి 23.40 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 18.13 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 18.15 గంటలకు బయలుదేరి మంగళవారం సాయంత్రం 16:30 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. 06564 మాల్దా టౌన్ - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు ఏప్రిల్ 17 నుండి మే 8 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 16.00 గంటలకు మాల్దా టౌన్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15.10 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి.

06221 మైసూర్ - ముజఫర్‌పూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 15 నుండి మే 6 వరకు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు మైసూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 07.18 గంటలకు దువ్వాడ చేరుకుని 07.20 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 13:30 గంటలకు ముజఫర్‌పూర్‌కు చేరుకుంటుంది. 06222 ముజఫర్‌పూర్ - మైసూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 18 నుండి మే 9 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 13.00 గంటలకు ముజఫర్‌పూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 19.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19.20 గంటలకు బయలుదేరి శనివారం 16.40 గంటలకు మైసూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే మీదుగా దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.


మొదటి పేజీ తరువాయి..



గాజువాకలో రాయి విసిరిన వ్యక్తి కోసం వెతుకుతున్న పోలీసులు

ప్రజా సమస్యల ప్రస్తావనేదీ ?

పల్లెత్తు మాట అనలేదు. స్టీల్‌ప్లాంట్ అమ్మకుండా అడ్డుకొని, సొంతగనులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్న మాట ఇవ్వలేదు. పాయకరావుపేటలో జరిగిన సభలో టిడిపి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్, జనసేన నాయకులు తోట నగేష్, గడ్డం బుజ్జి, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, గూటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. గాజువాక సభలో టిడిపి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన నాయకులు కోన తాతారావు, గంధం వెంకటరావు, దల్లి గోవింద్‌రెడ్డి, కరణం కనకారావు, బిజెపి నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, కిలారు ముసలయ్య, పలువురు టిడిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయని చంద్రబాబుపై పలువురు అసహనం ప్రదర్శించారు. ఆయన ప్రసంగిస్తుండగానే మధ్యలోనే కొంతమంది వెళ్లిపోయారు. కూటమి పార్టీల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపించింది.



అభివాదం చేస్తున్న చంద్రబాబు

క్షతగాత్రులకు సిహెచ్‌ఎన్‌ఆర్ పరామర్శ

పరామర్శించారు. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన వైద్యం అందుతుందా ? లేదా ? అని కనుక్కున్నారు. ఆయనతోపాటు మత్స్యకారులను పరామర్శించిన వారిలో ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ ఉన్నారు. ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లిన బోటులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గాయపడిన వారిని నేవీ నౌకల్లో చికిత్స నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వారిలో ఒకరు కొద్ది రోజుల క్రితం మృతిచెందగా, మిగతా వారు ఇక్కడే చికిత్స పొందుతున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

రైల్వేలో భద్రతా తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదివారం రాయగడ - లడ్డా సెక్షన్‌లో మూడో లైన్ పనులను పరిశీలించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆ మార్గంలోని కీలక స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రాయగడ రైల్వే స్టేషన్‌లో తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. మూడో లైన్ పనులు, స్టేషన్ల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) సుధీర్ కుమార్ గుప్తా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నీటిని అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో పశు, పక్ష్యాదులకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. ఆదివారం ఉదయం ఆయన ఎంపిపి కాలనీలో మీడియాతో మాట్లాడుతూ మానవాళి మనుగడ సమస్త జీవరాసులతో పెనవేసుకుని ఉందన్నారు. ఈ ఏడాది వేసవిలో ఏ జీవీ చనిపోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మాటల మర్మం..!



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విలువల్లేని వింతతో బతుకుతున్నా.. విలువలున్న వారిగా నమ్మించడానికి కొందరు ఉపయోగించే అస్త్రాలే అబద్ధాలు.. అసత్యాలు. ఎన్నికల్లో వీటి వ్యాప్తి, అవసరం ప్రధాన రాజకీయ పార్టీల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజలు మెచ్చుకొనే అభివృద్ధి అంశాలు ఆ పార్టీల వద్దలేక అబద్ధాలు సునాయాశంగా చెప్పనారంభిస్తారు. ఈ ఎన్నికల్లో ఆ తరహా అబద్ధాలే వ్యాప్తిలో వున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఇవి మరింత విస్తృతం కానున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపి మొదలుకొని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన నాయకుల వరకు స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఆడుతున్న నాటకాలు, చెబుతున్న కొత్త అబద్ధాలు వింటుంటే ఆ పార్టీల వక్రబుద్ధి, మోసం అర్థంకాక మానవు. అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ మాట్లాడినా, ఆ పార్టీని నెత్తికెత్తుకొని మోస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగం విన్నా, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రకటనలు చూసినా కాసింత విశాల హృదయంతో, భావిజీవితం బాగుండాలనుకొనే వారెవరైనా వారి మాటలు, చేష్టలు, దిగజారుడు వ్యాఖ్యలను అసహ్యించుకోకుండా వుండలేరు. ఛీ కొట్టకుండా వుండజాలరు.

తెలుగు ప్రజలు, ప్రధానంగా ఉమ్మడి విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లా వాసులకు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రధాన అజెండాగా ముందుకొచ్చింది. దీని భవిష్యత్ రాబోయే ఎన్నికల ఫలితాలపై ఆధారపడివుంది. ప్రధానితో తనకెంతో సాన్నిహిత్యముందని చెప్పుకొనే పవన్ కల్యాణ్‌కు స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ప్రధానిని అడగడానికి నాలుక తిరగలేదు.

అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌కు రాజ్యసభ ఆరేళ్ల పదవీకాలం సరిపోలేదు. తన చేతిలో వున్నట్లు స్టీల్‌ప్లాంట్ అమ్మకమే ఆపేస్తానని నమ్మలేని మాటలు నేడు ఆయన చెబుతున్నారు. స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మకుండా మెరుగ్గా నడిపించడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు చెప్పడానికి ఏ మాత్రమూ పురంధేశ్వరి సంకోచించలేదు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు ఏమనుకుంటారన్న ఆలోచన ఆమెకు వున్నట్లులేదు. ఇవన్నీ వింటుంటే గెలవడానికి చేస్తున్న విన్యాసాలు, మాయ మాటలు, మర్మం మాటలని ఇట్టే తెలిసిపోతుంది. అయినా వారికవేమీ పట్టడంలేదు. కావాల్సిందల్లా ఏ గడ్డికరిచైనా గెలుపే వారికి కావాలి. సహృదయులు, సత్య శోధకులు, అభివృద్ధిని ఆకాక్షించే, సమాజహితాన్ని కాంక్షించే వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వాస్తవాలు గుర్తెరిగి వంచకులకు బుద్ధి చెప్పాల్సిన రోజులు సమీపించాయి. ప్రజల కోసం నిరంతరం పనిచేసే, వారి సమస్యలపై పోరాటాలు నిర్వహించే, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమాలు నడిపే పార్టీ అభ్యర్థులకు ప్రజలు తోడుగా నిలబడాలి.

గాజువాక నుంచి బరిలో నిలిచిన సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడు, పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సిపిఐ అభ్యర్థి విమల ప్రజా పోరాటాల్లో మిలితమైన వాళ్లు. ఉద్యమాలు నడిపిన అనుభవం వున్నవారు. అటువంటి వారికి ఈ ఎన్నికల్లో అనుకూలమైన ప్రజాతీర్పు ఇచ్చినప్పుడే ప్రజలకు కొంతైనా మేలు జరుగుతుంది.

జగన్‌పై దాడిని ఖండిస్తూ వైసిపి నిరసనలు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై రాయితో దాడిని ఖండిస్తూ వైసిపి ఆధ్వర్యాన పలుచోట్ల ఆదివారం నిరసనలు తెలిపారు.

భీమునిపట్నం : స్థానిక పాత బస్టాండ్ వద్ద వైసిపి నాయకులు నిరసన తెలిపారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన కూడా ఇదే చోట నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, కదిరి ఎల్లాజీ, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, ఆర్.ప్రభాకరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరాస: ఎన్‌ఎడిలోని వైసిపి కార్యాలయం ఎదుట పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 14 వార్డుల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సీతమ్మధార : రాళ్ల దాడికి గురైన జగన్మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యాన తాటిచెట్లపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో, లూర్దు మాతా చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్, నాయకులు పైడి రమణ, రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాస్, సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సిఎం జగన్‌పై రాళ్ల దాడికి పాల్పడి, ఆయనను హత్య చేయడం కోసం ప్రయత్నించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైసిపి 31వ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ డిమాండ్ చేశారు. సిఎం జగన్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



చేపలు విక్రయిస్తూ ప్రచారం చేపడుతున్న వాసుపల్లి

దక్షిణంలో వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం అంటే మత్స్యకారుల అడ్డా అని, ఆ విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని నియోజవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ శ్రీ పోలమాంబ సూపర్ ఫిష్ మార్కెట్‌ను ఆయన సందర్శించి వర్తకులతో కలిసి వ్యాపారం చేశారు. అలాగే మత్స్యకార వ్యాపారులను వరస పెట్టి పిలుస్తూ అక్కడికి వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నారు. అక్కడి ఉన్న ప్రతి చేప పేరునూ చెబుతూ ఆశ్చర్యంగొలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.రాజు పాత్రుడు, బొడ్డేటి కిషోర్ పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక అసెంబ్లీ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు గెలుపు కోసం కార్యకర్తలంతా కృషి చేయాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. జివిఎంసి 72వ వార్డు పరిధి స్నేహపురికాలనీలో సిపిఎం అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పివైవి రమణారావు అధ్యక్షత జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ, గాజువాక నియోజక పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే జగ్గునాయుడును గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, డాక్టర్ రమేష్‌కుమార్, ఎస్‌వికె.పరశురామ్, సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం

అసంఘటితరంగ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు పేర్కొన్నారు. గాజువాక ఆటోనగర్‌లో విషెస్ కంపెనీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, సేఫ్టీ తదితరాలు అమలుకావడం లేదన్నారు. ఇండియా ఫోరమ్ అభ్యర్థిని గెలిపిస్తే కార్మికులకు ఇళ్ళు, కనీస వేతనాల కోసం పోరాటం చేస్తామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేలు వేతనం, కనీస వేతనాల వేజ్ బోర్డు సమావేశం జరిపించి కార్మికులకు జీతాలు పెంచేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వర్కర్స్ గో ఎగ్రిమెంట్ అయ్యేలాగా కృషి చేస్తామన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరమూ సిపిఎం పనిచేస్తోందన్నారు. వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిపిఎం నాయకులు ఎస్.రాజేంద్రప్రసాద్, ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ నాయకులు, విషెస్ కంపెనీ నాయకులు రామమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ఐతంశెట్టి రాము విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. ఆదివారం ఉదయం 11గంటల సమయంలో కొండకర్లలోని ప్రైవేట్ రిసార్ట్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురికావడంతో భవనంపైనుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్న క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడైన రాము మృతితో తిమ్మరాజుపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య గౌతమి తల్లిదండ్రులు భవాని, వెంకట అప్పారావు ఉన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు : వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- కె. కోటపాడు : అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలవ్వగా, మరో వ్యక్తి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీనికి సంబంధించి కె కోటపాడు పోలీసులు అందించిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన బోకం సురేష్ (33) లోకిరెడ్డి అప్పలరాజు శనివారం రాత్రి కె.కోటపాడు వస్తుండగా సూదివలస గ్రామం వద్ద చెట్టును ఢీకొట్టారు. దీంతో కారు పల్టీలు కొట్టి బోకం సురేష్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన అప్పలరాజును విశాఖ కెజిహెచ్‌కు తరలించి చికిత్సలందిస్తున్నారు. కె. కోటపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదో రోజుకు గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక : న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ అదాని గంగవరం పోర్టు కార్మికులు విధులు బహిష్కరించి చేస్తున్న ఆందోళన ఆదివారం నాటికి 5వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, గంగవరం పోర్టులో ఇస్తున్న వేతనాలతో బ్రతకలేక పెంచమని ఆందోళన చేస్తుంటే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కనీసం కార్మికుల నుంచి వినతి తీసుకొని, సంప్రదింపులకు కూడా ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. విశాఖ పోర్టుతో సమానంగా గంగవరం పోర్టులో కార్మికుల వేతనాలు సవరించాలని డిమాండ్ చేశారు. కనీసం రూ.36 వేలతో పాటు ఇతర అలవెన్సులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో శనివారం జరిగిన చర్చల్లో యాజమాన్యం, కార్మికులు పరస్పరం చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పారని తెలిపారు. సంప్రదింపులు ద్వారా సమస్యను పరిష్కారం చేసుకోవాలని కోరుతున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. యాజమాన్యం స్పందించి తమతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు, నాయకులు గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, స్వామి, సత్యానందం, నూకరాజు, పాల్గొన్నారు.

ప్రతిభకు అభినందనలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరో వార్డు పరిధిలోని రావులపాలెం గ్రామానికి చెందిన నాగోతి అప్పలరాజు కుమార్తె దేవశ్రుతి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో బైపిసి గ్రూప్‌లో 440 మార్కులకు గాను 431 సంపాదించింది. విద్యార్థినిని నగరాల కార్పొరేషన్ ఛైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆదివారం అభినందించారు. కొంత ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన ప్రతి ఒక్కరికీ నగరాల కార్పొరేషన్ నుంచి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక జంక్షన్‌లో చిట్టివలస శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాన్ని సత్య సాయి సేవా సమితి రాష్ట్ర టెక్నో కో-ఆర్డినేటర్ రాంప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాధిక షాపింగ్ మాల్ అధినేత కె అప్పారావు, సమితి జోనల్ కో ఆర్డినేటర్ ఎంవి సత్యసాయి, స్టడీ సర్కిల్ ఇంఛార్జి రవి ప్రసాద్, కన్వీనర్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చర్చికి బోరు, ఆర్ఓ ప్లాంటు

ప్రజాశక్తి -మధురవాడ : మిధిలాపురి ఉడాకాలనీలోని ఎస్ఎఫ్ఎస్ చర్చికి రూ.4 లక్షల విలువజేసే బోరు, ఆర్ఓ ప్లాంట్‌ను పోతిన నాయుడుబాబు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆయన కుమారుడు పోతిన నగేష్ అందించారు. ఆదివారం ఉదయం ఆర్ఓ ప్లాంట్‌ను పోతిన నగేష్, హాసిని దంపతులు ప్రారంభించారు. మంచినీటి ప్లాంట్‌ను విరాళంగా ఇచ్చిన దంపతులకు చర్చి పాస్టర్ ప్రకాష్ ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా పివిఎన్‌బి అధినేత పోతిన నగేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : పలువురు వైసిపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజు (హాసిని వర్మ) తెలిపారు. తాళ్లవలసలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమి నేతల ర్యాలీ

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యాన సింహాచలం తొలిపావంచా నుంచి పెందుర్తి వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి పలు ప్రాంతాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

మజ్జివలసలో వైసిపి బహిరంగసభ



బహిరంగ సభలో మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని మజ్జివలస గ్రామంలో ఆదివారం రాత్రి వైసిపి ఆధ్వర్యాన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి హాజరై మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్నికల తర్వాత టిడిపి గల్లంతవుతుందని వ్యాఖ్యానించారు. ప్రజల ఆదరణను చూసి ఓర్వలేని వారు విజయవాడలో సిఎం జగన్మోహన్‌రెడ్డిపై భౌతిక దాడికి దిగారని ఆరోపించారు. భీమిలి ప్రాంత సమగ్రాభివృద్ధికి కృషిచేసిన స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్నికల్లో న్యాయమే గెలుస్తుందని, వైసిపి గెలుపును ఏ ఒక్కరూ అడ్డుకోలేరని అన్నారు. 4 సంవత్సరాల 10 నెలల కాలంలో నీతివంతమైన పాలన అందించినందున ప్రజలు వైసిపికే పట్టం కడతారన్న విశ్వాసం తనకు ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను వైసిపి ప్రభుత్వం గౌరవించినందునే విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిందని గుర్తు చేశారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, నియోజక వర్గ పరిశీలకులు పి.బాలరాజు తదితరులు మాట్లాడారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎదురుపడ్డ ప్రత్యర్థులు

ప్రజాశక్తి- గాజువాక: గాజువాక నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీగా ఎన్నికల పోరు నడుస్తోంది. ఇరుపార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రెండు పార్టీల అభ్యర్థులు తారసపడితే ఎలా ఉంటుంది? ఆదివారం సరిగ్గా ఇదే జరిగింది. 75వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు మంత్రి అమర్‌నాథ్ బయలుదేరారు. గాజువాకలోని హోటల్ వంటిల్లు సమీపంలోకి రాగానే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అక్కడ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. తన వాహనంలో వెళ్తున్న అమర్‌నాథ్‌ను చూసి పల్లా పలకరించారు. వెంటనే అమర్‌నాథ్ తన వాహనం దిగి పల్లా శ్రీనివాసరావు దగ్గరకు వెళ్లి కరచాలనం చేశారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ములగాడ : షిప్‌యార్డు కాలనీ, కాకరలోవ, ఎకెసి కాలనీలకు చెందిన తెలుగుదేశం జనసేన నాయకులు కార్యకర్తలు జివిఎంసి 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. వీరికి పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి ఎలమంచిలి మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి.రమాకుమారి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పశ్చిమ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్, విశాఖ ఎంపీగా అభ్యర్థి బొత్స ఝాన్సీల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ ఉత్తరాంధ్ర అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో...

జివిఎంసి 58వ వార్డులో టిడిపి, జనసేనకు చెందిన సుమారు 30 మంది సూర్యప్రకాష్ ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. వారికి ఆడారి ఆనంద్‌కుమార్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుర్రె సురేష్, సోమాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో ఆత్మీయ సమావేశాలు, కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 49వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీ, మసీదు జంక్షన్ వద్ద వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైసిపి ఎన్నికల కార్యాలయాన్ని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు జనసేన నాయకులు కెకె.రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రేయి వెంకటరమణ, నాయకులు ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిలతో ఆత్మీయ సమావేశం

బొత్స స్క్వేర్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర మ్యారీ టైమ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యాన విశాఖ పార్లమెంట్ పరిధి రెడ్డిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, కెకె.రాజు పాల్గొన్నారు.

రజకులతో సమావేశం

26వ వార్డు రామకృష్ణనగర్, సంకువానిపాలెంలో రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కలిగించేలా జగన్మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బులుసు జగదీష్, అనురాగ్, బొడ్డేటి కిరణ్, ఎం.సునీల్, పాండవ శ్రీను, శేషు, హరికృష్ణ, ప్రకాష్, విజయ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 46వ వార్డు తెలుగుదేశం మాజీ కార్పొరేటర్ పామేటి బాబ్జి, నాయకులు తిక్కాడ చిన్న ఆదివారం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు, డిప్యూటీ మేయర్ కటమూరి సతీష్ ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. వారికి రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అగ్ని మాపక అధికారి జి.శ్రీనివాసరాజు పతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాల నేపథ్యాన్ని, ప్రాధాన్యతను వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. అనంతరం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగు వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి-యంత్రాంగం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఆదివారం విశాఖ నగరంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

లీగల్ : విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఎన్వి.సుమన్, కెఎస్.సురేష్‌కుమార్, ఎమ్‌డి హబియబుల్లా, యుఎస్ఆర్ రాజు, పాక సత్యనారాయణ, బత్ టక్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరాస: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) మానసి ఆడిటోరియంలో అంబేద్కర్ చిత్రపటానికి నేవల్ సిస్టం అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రవి, ఆనంద్‌కుమార్, జెఎన్.వర్మ, డాక్టర్ హెచ్ఎం.దాస్, జి.రమేష్‌కుమార్, సిర్ర కరుణరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మాజీ కౌన్సిలర్ జివి రమణ ఆధ్వర్యాన తగరపువలస జంక్షన్‌లో, దళిత కులాల సంక్షేమ సేవా సంఘం కన్వీనర్ సామంతుల సత్తిరాజు ఆధ్వర్యంలో భీమిలి మండలం అన్నవరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్లాజీ, లక్ష్మణ రావు, అప్పన్న, ఎం.వెంకట శివ, సోమి వెంకట్, కె ఈశ్వర కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనాథ పిల్లల కేంద్రానికి బియ్యం, నోట్ పుస్తకాలు అందజేశారు. టిడిపి మూడో వార్డు నాయకులు స్థానిక ప్రభుత్వ డైట్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.సంజీవకుమార్, జి.పోలిరాజు, పైడిపల్లి నరసింగరావు, కొక్కిరి అప్పన్న, కె కామేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి మండలం తాళ్లవలస లో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకట వర్మరాజు (హాసిని వర్మ) అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్ తదితరులు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, కె.ఎల్లాజీ, ఎ.నరసింగరావు, జి.మధునాయుడు, సూర్యప్రకాష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తగరపువలస సిపిఐ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, నరసింహులు, ఎం.వీర్రాజు, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పొట్నూరు, రెడ్డిపల్లి, పాండ్రంగి, వికె.పాలెం, మద్ది, పద్మనాభం గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, కోరాడ లక్ష్మణరావు, ఈర్ల ఈశ్వరరావు, సత్యనారాయణ, పద్ద సూరప్పడు, అప్పలనాయుడు, ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ లా ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండాడలోని వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, నాయకులు బోని శివ రామకృష్ణ పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి విశాఖ పశ్చిమ నియోజక వర్గం తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బంగారు తులసిరామ్, నరవ అనూష, శ్రీకుమార్, బోనాల రామకృష్ణ , పొలాసపల్లి రమేష్ , ఉప్పిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 91వ వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి, రమా కుమారి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి రమాకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లే అప్పలస్వామినాయుడు, బండి దుర్గేష్, తెలుకుల రమేష్, వైట్ రాజు, ఎస్.వెంకట్, గంగరాజు, వూటపల్లి గోవింద్, ఇ.శ్రీను అనంత్ పాల్గొన్నారు.

గోపాలపట్నం గ్రామంలోని విగ్రహానికి దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యాన అంబేద్కర్ పార్క్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ బాక్సి, డైరెక్టర్ పర్సనల్ పాండే, డైరెక్టర్ ఫైనాన్స్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ సేవలు కొనియాడారు. జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బోండా తౌడన్న, భయ్యా మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, మోహన్‌బాబు, పుల్లారావు, కెవి.రత్నం, ప్రసాద్, ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, వైటి.దాస్, జనరల్ మేనేజర్ నల్లి భాను తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. 50వ వార్డు బిర్లా జంక్షన్ వద్ద కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యాన కెకె.రాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 47వ వార్డు రాంజీ ఎస్టేట్‌లో రాంజీ ఆభ్యుదయా సేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి కెకె.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి సంస్థ డైరెక్టర్ సి.శ్రీనివాసమూర్తి, సిజిఎంలు అచ్చి రవికుమార్, బి రామచంద్రప్రసాద్, జె శ్రీనివాసరావు, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆరిలోవ : 12వ వార్డు పరిధి పెదగదిలి కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, దువ్వి తాతారావు, ముగడ రాజారావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొలగాని శ్రీనివాసరావు, అల్లంపల్లి రాజబాబు, గూడపాటి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అప్పలనాయుడు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేములవలస పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఉప్పాడ సీతారాం, రమణ, ఉప్పాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవలస కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పాస్టర్ల అధ్యక్షుడు ప్రభుదాస్, మాజీ కో ఆప్షన్ నెంబర్ జంగం జోషి, ముదపాక అబ్రహం, ఎస్‌విపిడి ప్రభాకర్, కార్యదర్శి ఆనందరావు, హనోకు, శాంతిరాజు, నేహేమియా. ఎస్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో బిజెపి నాయకుడు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యాన అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ పాల్గొన్నారు.

గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం సాయంత్రం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులపై దాడులు చేస్తుందన్నారు. గిరిజనులకు అడవిపై కూడా హక్కులు లేకుండా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బి.తౌడన్న, సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ కార్యదర్శి తవిటయ్య, ట్రెజరర్ రమణ, శ్రీనివాస్ చౌదరి, రామన్న పాల్గొన్నారు.

పెందుర్తి : ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహామూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు.



తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో
అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తౌడన్న

మాధవధార : అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు. లాసన్స్ బే కాలనీలో జరిగిన వేడుకల్లో వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పేర్ల విజయ్ చంద్ర పాల్గొన్నారు. వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝూన్సీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ చంద్రమౌళి పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో జరిగిన వేడుకల్లో సిపి రవిశంకర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో..

విశాఖ కలెక్టరేట్ : అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (అంబేద్కర్ భవనం) నేతృత్వంలో ఆదివారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి రామాటాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవనం వరకు జరిగిన ఈ ర్యాలీలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ సభ్యులు, యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం 8:30 గంటలకు ఎల్ఐసి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణ చేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ బుద్ధ విహార్ ఫౌండేషన్ డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో కమిటీ కోశాధికారి జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇంటి గురుమూర్తి, కడితి సాధు, అలమండ ప్రసాద్, కాంతారావు, సరస్వతి పాల్గొన్నారు.

పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

విశాఖ పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అడ్వైజర్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వేణు ప్రసాద్, కార్యదర్శి వేణుగోపాల్, సిఎంఇ హరికృష్ణ, డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాసరావు, ఎఫ్ఎ సిఇఒ రమణమూర్తి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రవికుమార్, అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి దేవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కలెక్టరేట్‌లో...

అంబేద్కర్‌కు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఘన నివాళ్లర్పించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిఆర్ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు పాల్గొన్నారు.

దక్షిణ నియోజవర్గంలో..



నివాళులర్పిస్తున్న పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్

ఫిషింగ్ హార్బర్‌లో విశాఖ బోట్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో జనసేన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నారు. 37వ వార్డులో వైసిపి కార్యకర్తలు, రెల్లి కుల సంఘాలు, సేవా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడారు. డెంకాడ వీధి, పెయిన్‌దొర పేట, తదితర ప్రాంతాలలో జరిగిన వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అంబేద్కర్ గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. అంబేద్కర్‌కి నిజమైన నివాళులర్పించడం అంటే కేంద్రంలోని మతోన్మాద శక్తులను ఓడించడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కాసులరెడ్డి, అప్పన్న పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు. రామ్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకులు సోములు నివాళ్లర్పించారు. అంబేద్కర్ మహనీయుడని కొనియాడారు. సంఘం నాయకులు కె.నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామారావు, దుర్గారావు పాల్గొన్నారు.

గాజువాక : జింక్ ఎస్‌సి, ఎస్‌టి, విఆర్ఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యాన జింక్ గేటు వద్ద అంబేద్కర్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, జింక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పూర్వ ప్రధాన కార్యదర్శి వై.సత్యనారాయణ, జింక్ ఎస్‌సి, ఎస్‌టి, విఆర్ఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఈశ్వరరావు, శివప్రసాద్, అప్పారావు, పద్మనాభం, జగన్నాధం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.సత్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



జింక్ గేటు వద్ద మాట్లాడుతున్న వై.సత్యనారాయణ


ఐద్వా మండల కమిటీ ఎన్నిక



సమావేశమైన .ఐద్వా మండల కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఐద్వా మండల కమిటీ ఎన్నిక జరిగింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఐద్వా మండల కమిటీ సమావేశంలో సత్యనారాయణపురం, మూలపేట,అనకాపల్లి సభ్యులు హాజరయ్యారు. నూతనమండల కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా మండల కమిటీ అధ్యక్షురాలిగా యు.నాగమణి, కార్యదర్శిగా ఎం సరోజ, సహాయ కార్యదర్శిగా ఆర్.లక్ష్మి, జాయింట్ సెక్రటరీ యు లోవ కమిటీ మెంబర్లగా ఎస్ జానకి, మానస, సునీత, నాగమణి, ఎ.వరలక్ష్మి తదితరులు ఎన్నికయ్యారు. వీరిని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డిడి వరలక్ష్మి అభినందించారు.

జనసేనలో పలువురు చేరిక



జనసేన పార్టీలో చేరిన వారితో సుందరపు విజయకుమార్

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని పాటిపల్లికి చెందిన కొయిలాడ జగదీష్ ఆధ్వర్యంలో 48 మంది ఆదివారం జనసేనలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ, కన్నబాబు ఆగడాలను తట్టుకోలేని వైసిపి కార్యకర్తలు ఆపార్టీని వీడి జనసేనలో చేరుతున్నారన్నారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరుశురాం , వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ వి సత్యనారాయణ. పాటిపల్లి నాయకులు ఆడారి గోవింద, ప్రధాన కార్యదర్శి కాళ్ళ చంద్రమోహన్, ఉపాధ్యక్షులు పాలపిన్ని రాము, మొల్లేటి ఆనంద్, అల్లవరపు రమణబాబు, సూరిశెట్టి అప్పలనాయుడు, సరోజిని పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ భీశెట్టి రాము, ఆడారి నర్సింగరావు జనసేన పార్టీలో చేరారు. పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామంలో శనివారం రాత్రి జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఎంపి అభ్యర్థి సోదరుడు సీఎం రాజేష్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వీరు జనసేనలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు జనపరెడ్డి నర్సింగరావు, గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాపు నాయుడు, కర్రీ ఆదిబాబు పాల్గొన్నారు.

జగన్‌పై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి -చోడవరం : సిఎం జగన్‌పై దాడి హేయమైన చర్య అని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ప్రచారంలో జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే విపక్ష ఈ చర్యకు పూనుకున్నాయని ఆరోపించారు. కాగా చోడవరం పార్టీ కార్యాలయంలో చోడవరం నియోజకవర్గ స్థాయి వైసిపి సమావేశం సోమవారం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు వస్తారని, కార్యకర్తలందరూ హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నరసింగబిల్లి, కన్నురుపాలెం విద్యత్ సబ్‌స్టేషన్ పరిధి లో సోమవారం, మంగళవారం రెండురోజులూ ఉదయం 6.30 నుండి 10.30 వరకు విద్యత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు తాళ్లపాలెం, కన్నురుపాలెం, చూచి కొండ,పరిధి లో వ్యవసాయ మోటార్లు గృహ విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైసిపి ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవంలో సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ భవనంలో అనకాపల్లి పార్లమెంటరీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై వి సుబ్బారెడ్డి ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌లను గెలిపించాలని కోరారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ బీవీ సత్యవతి, అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కొణతాల భాస్కరరావు, జాజుల రమేష్, పలక రవి, డాక్టర్ విష్ణుమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు పెద్ది శెట్టి గోవింద పాల్గొన్నారు.

జోరుగా వైసిపి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అదీప్‌రాజ్

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కాండ్రేగుల రాము, కర్రి కిరణ్, మద్దాల సురేష్ పర్యవేక్షణలో మలసాల భరత్ కుమార్‌కు మద్దతుగా జరిగిన అరుంధతి నగర్, వెంకన్న కొట్టు జంక్షన్, శతకంపట్టులో ఆదివారం గడపగడపలో ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజా ప్రచారంలో పాల్గొనిగడపగడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

భరత్‌కు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని, అలాగే ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో పెంటకోట శ్రీను, రైతు నాయకులు కర్రి రమేష్, శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం డైరెక్టర్ మారిశెట్టి శ్రీను, పెంటకోట దామోదర్, సూరిశెట్టి రవి, కాండ్రేగుల దేవా, పెంటకోట సునీల్, ఆడారి శోభన్,పొలమరశెట్టి రమణ జిగట గణేష్ మైపాలి తేజ, మర్రా జాన్ బాబు పాల్గొన్నారు.

వైసిపికి ఓటేసి గెలిపించండి :అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని భరణికం పంచాయతీ భరణికం, కట్టవాన్నిపాలెం, బాపడుపాలెం గ్రామాల్లో ఆదివారం వైసిపి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్ ఆధ్వర్యంలో స్థానికులు పులమాలలతో స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపిగా బూడిముత్యాలనాయుడును ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న ప్రజాదరణకు ఓర్వలేని విపక్షాలు చేసిన రాళ్లదాడిని ఖండించారు కార్యక్రమంలో సిఇసి రాష్ట్ర సభ్యులు పైలా శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు, బైలపూడి భగవాన్ జై రాం, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, గొర్లి గోపి అమ్మలు, కలపాక ఎంపిటిసి సప్ప ప్రభ సన్యాసిరావు, వడిసల కనకరాజు, పైలా అప్పలనాయుడు,కడవల వరలక్ష్మి, పెదశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి ప్రచారం



పైలా సమక్షంలో టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని ఎ.కోడూరు పంచాయతీ శివారు పొడుగుపాలెం గ్రామంలో. టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 24 కుటుంబాలు వైసిపిని వీడి పైలా సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అర్‌బి.కె.చైర్మన్ దొగ్గ సత్యం, వార్డు మెంబర్ లెక్కల గణేష్, సాగు నీటి సంఘం మాజీ చెర్మన్ బొకం జగ్గి తదితరులకు పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి పైలా ఆహ్వానించారు. టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పధకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు దష్ట్యా వైసీపీని ఓడించి టిడిపిని గెలిపించాల్సిన అవసరాన్ని ప్రసాదరావు ప్రజలకు వివరించారు.

కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, క్లస్టర్ ఇంచార్జి లెక్కల మల్లేశ్వరరావు, సర్పంచ్ బొడ్డు అక్కు నాయుడు, మేడిచర్ల ఎంపిటిసి మాజీ సభ్యుడు పూడి నారాయణమూర్తి, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు సబ్బవరపు రామునాయుడు, నాయకులు వి.ఎస్.నాయుడు, బండారు నరసింహనాయుడు ఉన్నారు.

అనకాపల్లి : జివిఎంసి 83వ వార్డు లక్ష్మీదేవి పేటలో కూటమి తరపున పోటీలో ఉన్న ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, బిజెపికి చెందిన సి ఎం రమేష్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో తెలుగుదేశం నాయకులు కర్రి గోవి, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేగుల ముకుందరావు, లాయర్ శ్రీను, కాళ్ళ రవి, గంపల శ్రీను, కొణతాల గణేష్, దొడ్డి కనక, జనసేన నాయకులు జానా శివ, ఏపూరి రమేష్, కొణతాల బాలప్పరావు, బిజెపి నాయకులు కొణతాల సూర్య సత్యనారాయణ, కొణతాల సాయిరాం ప్రసాద్, కొణతాల కనక రాజు, కొరిబిల్లి చందమామ, ఆడరి వాసు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక



ధర్మశ్రీ సమక్షంలో పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పంచాయతీ పిఎస్ పేట గ్రామానికి చెందిన 15 మంది జనసేన కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే చోడవరం వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. చోడవరం పార్టీ కార్యాలయంలో వారందరికీ పార్టీ కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ధర్మశ్రీ కి మద్దతుగా ప్రచారం చేపట్టి, విజయానికి కృషి చేస్తామన్నారు. వైసిపిలో చేరిన వారిలో పట్నూరు దుర్గాప్రసాద్, గరికి పవన్, సురేష్, ప్రవీణ్ కుమార్, కర్రి మూర్తి, అనప రెడ్డి రమణ, బి హరి, దేవరపు శంకర్, నక్క పవన్, మునగపాక రమేష్, శివ, ఆబోతు పరదేశి నాయుడు ఉన్నారు.

మునగపాక: మండలంలోని నాగులపల్లి, రామగిరి , మెలుపాక గ్రామాలకు చెందిన 150 మంది ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వీరికి స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానించారు ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, డిసిసిబి మాజీ అధ్యక్షులు యు సుకుమార్ వర్మ, కాండ్రేగుల చందు, పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, చిందాడ దేవి, అయినంపూడి విజయ భాస్కర రాజు పాల్గొన్నారు .

పక్షుల సంరక్షణలో గ్రీన్‌క్లబ్



పార్కులో చెట్లకు తిండిగింజలు, నీటితొట్టెలు కడుతున్న గ్రీన్‌క్లబ్

ప్రజాశక్తి-.అనకాపల్లి : వేసవిలో ఆహారం, తాగునీటికి అల్లాడే పక్షులకు గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో తిండిగింజలు, తాగునీటి తొట్టెలు ఏర్పాటు అభినందనీయమనిప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. ఆదివారంస్థానిక గ్రీన్ క్లబ్బు వ్యవస్థాపక అధ్యక్షుడు కొడతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాస్టర్ ఆధ్వర్యంలో అనకాపల్లి పార్కుల్లో పక్షులకు తిండి గింజలు, నీటి తొట్టెలు ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద పక్షులకు తిండి గింజలు,తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, పి ఎ ఆర్‌వి మహేష్, కొణతాల పూర్ణచంద్రరావు, రాపేటి నారాయణ రావు, వై శివ, బిశెట్టి రామ కష్ణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, ఆశాలత పాల్గొన్నారు.

మోడల్ పాలిసెట్‌కు మంచి స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గాలి భీమవరంలో ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మోడల్ పాలిసెట్– 2024 పరీక్షకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్. నాగభూషణరావు తెలిపారు. ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా ఎపి పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ముందస్తు అవగాహనకు తమ కళాశాలలో ఈ మోడల్ పాలిసెట్ నిర్వహించామన్నారు. విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల నుండి పలు పాఠశాలలకు చెందిన 250 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ రమణ

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని సబ్బవరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సబ్బవరం వాసవి క్లబ్ రూరల్ యూనిట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని సిఐ పిన్నింటి రమణ ప్రారంభించారు జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పాక శేషు వాసవి క్లబ్ సేవలకు రూ.ఐదు వేలు విరాళం అందించారు. సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, క్లబ్ అధ్యక్షులు బందారు వెంకట నాగరామారావు, సెక్రటరీ డి .అయ్యప్ప, ట్రెజరర్ దంగేటి సంతోష్ గుప్తా, సభ్యులు దంగేటి నాగేష్, దంగెటి నరేష్ ,దంగేటి సంతోష్ పాల్గొన్నారు.

220 మందికి ఉచిత కంటి పరీక్షలు



డాక్టర్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : చౌడేశ్వరి పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం, విశాఖ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. స్థానిక గొల్లవీధిలోని చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో నిర్వహించిన శిబిరంలో 220 మంది రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి విశాఖ ఐ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స చేస్తామని దేవాంగ సంక్షే మ సంఘ ప్రోగ్రాం కన్వీనర్ బల్లా నాగభూషణం తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షులు ముప్పన సిల్క్ అధినేత ముప్పన సుబ్రమణ్యం, విశాఖ ఐ.హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.మౌనిక, సంఘ అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిలు బాసిన బాల గురాజీ, వేమన సంతోశ్, కోశాధికారి ముప్పన వాసు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని మాపక వాహనాన్ని ప్రారంభిస్తున్న సత్యరాజు

ప్రజాశక్తి- సబ్బవరం. : స్థానిక అగ్నిమాపక కేంద్రం ప్రాంగణంలో ఫైర్ ఆఫీసర్ జి.వి. సత్యరాజు ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు అగ్నిమాపక శకటాన్ని జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నుంచి భద్రత పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులకు నివాళ లర్పించారు. అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈనెల 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పాఠశాలలోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తామన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని ఆదివారం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

(ప్రజాశక్తి -యంత్రాంగం)

గాజువాక : గాజువాక పరిధి వంద అడుగుల రోడ్డులోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గు నాయుడు, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ నిరంతరం శ్రమించారని కొనియాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో గెలిస్తే భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, డి.రమణ, ఎ.లోకేష్, బి.శ్రీను, ఎం.విజయరావు, సత్యనారాయణ, బుచ్చమ్మ, సిపిఐ నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, జి.ఆనంద్, కె.రాజబాబు, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు పాల్గొన్నారు.జివిఎంసి 70వ వార్డు దశమకొండ ఏరియాలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు నరసింగరావు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు లోవరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.పద్మ, ఎం.సుబ్బారావు, నరేంద్ర కుమార్, వై.మంగ పాల్గొన్నారు.

జివిఎంసి 87వ వార్డు పరిధి లక్ష్మీపురం, పాత వడ్లపూడి దళిత కాలనీ సామాజిక భవనం వద్ద అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమలు ఉండాలన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. గాజుక అసెంబ్లీ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్ల అభివృద్ధి సాధించామని, ప్రైవేటీకరణ పేరుతో ఆ అభివృద్ధిని వెనక్కునెడితే సహించేది లేదని స్పష్టంచేశారు. ప్రయివేటీకరణ వ్యతిరేక శక్తులన్నీ ఐక్యమై అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేసినప్పుడే బాబా సాహెబ్ అంబేద్కర్‌కు మనం అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు.కార్యక్రమంలో ఎం.రాంబాబు, జె.అయోధ్యరామ్, వీరాస్వామి, టి.చిరంజీవి, నూకరాజు, నూకరాజు, సూరప్పారావు, రమణమ్మ, పుష్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, సిపిఎం నేతలు

అనకాపల్లి : కుల నిర్మూలన, కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయం లో అంబేద్కర్ చిత్రపటానికి సీనియర్ నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు కె ఈశ్వరరావు, కె.తెల్లయ్య బాబు, పి.చలపతి, బి. నూక అప్పారావు పాల్గొన్నారు.



భీమిలిలో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నేత బాగం లక్ష్మి

భీమునిపట్నం : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నాయకులు భాగం గోపాలరావు, నాయకులు గంధవరపు కృష్ణ, పైడిరాజు, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : ఆధ్వర్యాన కొమ్మాది ఎస్సీ కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి సిఐటియు, కెవిపిఎస్ జోన్ నాయకులు ఎస్.పైడితల్లి, ఎంవి.ప్రసాద్ పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆదిలక్ష్మి, కె.పుష్ప, సత్యం, ఎస్.బంగార్రాజు పాల్గొన్నారు.

మునగపాక: స్థానిక ఎస్‌సికాలనీలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మాజీలు పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా నేటి పాలకులు వ్యవహరిస్తున్నారని, అంబేద్కర్ ఆశయ సాధనకు కోసం నేటి యువత మరింత పట్టుదలతో పోరాడాలని పిలుపునిచ్చారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

కశింకోట : స్థానిక జాతీయ రహదారి పక్కన, దళిత, రెల్లి వీధిలో అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి నివాళులర్పించారు.

కె. కోటపాడు: స్థానిక సిఐటియు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర దేవుడు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కొరకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన మహనీయుడు అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. నాయకులు ఈర్ల నాయుడుబాబు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని జోగుంపేటలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. చిట్ల చలపతి పాల్గొన్నారు. కొత్తమల్లంపేటలో ఏఐయమ్ పొలిటికల్ కమిటీ రాష్ట్ర సభ్యులు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. కొత్తమల్లంపేట జైభీమ్ సేవ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జైభీమ్ సేన అధ్యక్ష, కార్యదర్శులు వి.లోవరాజు, వి.రమేష్, బి.చిరంజీవి పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, చోద్యం స్కూల్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా సమితి సభ్యులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద సిఐటియు నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం కార్యకర్తలు, నాయకులు, వైసిపి గ్రామ అధ్యక్షులు అంబేద్కరడ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ శిరసాల మహేష్, దేమునాయుడు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గాలి అప్పారావు, కోటేశ్వరరావు, శ్రీరామ్ మూర్తి, బుచ్చిబాబు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా : శ్రీభరత్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

ప్రజాశక్తి -గోపాలపట్నం : అవకాశం ఇస్తే విశాఖను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని తెలుగుదేశం, బిజెపి జనసేన కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ చెప్పారు. స్థానిక లక్ష్మీకల్యాణ మండపంలో కెటిబి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో కలిసి హాజర య్యారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడు తూ, గత పార్లమెంట్ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందానన్నారు. ఏ ఒక్క కులంతో అధికారం సాధ్యం కాదని, సమిష్టిగా అందరూ పని చేస్తేనే ఆయా పార్టీలు అధికారంలోకి వస్తాయన్నారు. తెలుగు దేశం పార్టీ నుంచి స్థానిక ఎమ్మెల్యే గణబాబు చాలా తెలివైన వ్యక్తి అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టు ఎక్కించేందుకు భారతీయ జనతా పార్టీతో కలిసి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, విద్యావంతుడైన శ్రీభరత్‌కు అవకాశం ఇవ్వాలని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం కాపు సంఘం నాయకులను సత్కరించారు. కూటమికి మద్దతు తెలుపుతూ బొడ్డేపల్లి గాంధీరాం, కంచిపాటి సూర్యనారాయణ, నందవరపు సోములు, బూరెల నరసింగ నాయుడు, రాజశేఖర్, నవీన్ మాస్టర్, లంక అనిల్, కంపర్ ఆనంద్, తమ్మినాయుడు, ఉండి రాము, నారిపిన్ని అప్పలరాజు, నారిపిన్ని సత్తిరాజు, కాపు, తెలగ, బలిజ నేతలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి



అవగాహన కల్పిస్తున్న సిఐ వినోద్ బాబు

ప్రజాశక్తి -కశింకోట : రానున్న ఎన్నికల్లో ఓటర్లంతా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కశింకోట సిఐ వినోద్ బాబు సూచించారు. ఆదివారం మండలంలోని నూతన గుండుపాలెంలో ఓటర్లకు శనివారం రాత్రి ఎన్నికల పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన భద్రతను పోలీసుశాఖ పరంగా కల్పిస్తామన్నారు. ఎస్ఐ రమేష్ బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి

-ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వేంపాడు టోల్ గేట్ వద్ద సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ, వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. మద్యం, నాటు సారా, మత్తు పదార్థాలు, అక్రమ రవాణా అరికట్టాలని, డబ్బు, ఉచిత కానుకలు పంపిణీ అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.



3.సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ



భక్తి గీతాలు ఆలపిస్తున్న బాలికలు

అలరించిన భక్తి గీతాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరక వీధి రామాలయంలో ఏర్పాటు చేసిన సప్తహం కార్యక్రమం ఆదివారం నాటికి 5వ రోజుకు చేరింది. ఎస్ రాయవరం మండలం పి.ధర్మవరంకు చెందిన శ్రీ వీరాంజనేయ మహిళా భజన బృందం బాలికలు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. పద్మనాభ రాజుపేట, బైరిపురం, పి ఎల్ పురం తదితర గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించారు. భజన బృంద సభ్యులను శ్రీ శ్రీనివాస భజన భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అయ్యన్న

16న నర్సీపట్నంలో 'యువశక్తి'

-మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఈనెల 16న నర్సీపట్నం లో యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆదివారం యువశక్తి పోస్టర్లను నర్సీపట్నంలో ఆవిష్కరించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వంగవీటి రాధ హాజరవుతారని చెప్పారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుత వైసీపీ పాలనలో యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అటువంటి అన్యాయాలను ప్రశ్నించడమే లక్ష్యంగా ఈ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ,డాక్టర్ సుధాకర్‌కు జరిగిన అన్యాయంపై ఇతర దేశాల్లో కూడా చర్చ జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సంపద తయారీ కేంద్రం



పిల్లర్లు దశలో నిలిచిన భవనం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో ఎట్టకేలకు గత ఆర్థిక సంవత్సరంలో మొదలు పెట్టిన సంపద తయారీ కేంద్రం అసంపూర్తిగానే మిగిలింది. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభించిన సంపద కేంద్రం నిర్మాణం స్థలం వివాదం కారణంగా చేపట్టలేదు.గత ఏడాది ఐదు లక్షల ఉపాధి, సచివాలయ నిధులతో నిర్మాణం ప్రారంభించారు. నేటికీ భవనం పిల్లర్ల దశలోనే ఉండటంతో అసంపూర్తిగా దర్శనమిస్తుంది. దీంతో గ్రామంలో పలుచోట్ల సేకరించిన చెత్తను డంపింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తిగా ఉన్న సంపద కేంద్రాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

లింగాపురంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ 20వ వార్డు లింగాపురం గ్రామంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ, లింగాపురం గ్రామంలో ఎస్టీ కొండదొర తెగకు చెందిన 292 ఓటర్లు ఉన్నారన్నారు. లింగాపురం నుండి కృష్ణాపురం పోలింగ్ బూత్ వెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్ల వెళ్లాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం మూడు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ బూత్ ఉండాలని, అన్ని సౌకర్యాలు లింగాపురంలో ఉన్నా కృష్ణాపురంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఈ మేరకు అంబేద్కర్ చిత్ర పటానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటానికి వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

ఓర్వ లేకే దాడులు : ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాధారణ చూసి ఓర్వ లేకే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ సంఘటన చాలా బాధాకరమన్నారు. విజయవాడ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టారని, దాన్ని చూసి తట్టుకోలేక ఇటువంటి దాడులు చేస్తున్నారని విమర్శించారు.

మద్యం దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి- కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల కమిషన్ మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించింది. గత ఏడాది నెలలతో పోల్చుకొని 30శాతం మాత్రమే అధికంగా అమ్మకాలు సాగించాలని నిబంధనలను విధించడంతో మందుబాబులకు సాయంత్రం సమయానికి మందు సేవించేందుకు వెళ్లే వాళ్లకు మందు చిక్కక దక్కక అగచాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మండలవ్యాప్తంగా 25 గ్రామాలకు గాను మూడు మద్యం దుకాణాలు ఉన్నాయి. మండల సరిహద్దుల గ్రామాల నుంచి గతంలో ఆయా గ్రామాల ప్రజలు కొనుగోలు చేసి వినియోగంతో పాటు అమ్మకాలు చేపట్టే వారిని ఆరోపణలు ఉన్నాయి, అయితే ప్రస్తుతం నిబంధనల మేరకు ఒక్కో వ్యక్తికి ఒక్క బాటిల్ మాత్రమే ఇవ్వాలని ఆంక్షలు ఉండడంతో మద్యానికి డిమాండ్ ఏర్పడింది. ఇదే అదునుగా కొన్ని గ్రామాలలో నాటు సారా తయారీ విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. అధికారులు మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మద్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఆదమరిస్తే ప్రమాదమే?

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో రామచంద్రపాలెం వెళ్లే రహదారి కొత్తపల్లి దాటిన తర్వాత ఉన్న గోర్జి వద్ద మలుపు వద్ద ఆదమరిస్తే ప్రమాదం సంభవించక మానదు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మలుపు వద్ద రోడ్డు కోతకు గురవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయని కొత్తగా ప్రయాణించే వారు ఆదమరిస్తే ప్రమాదం ముంచుకొస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీప ప్రాంత రైతులు ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, తక్షణమే ఆ ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

సంగీత సాహిత్యాలతో ఉల్లాసం

ప్రజాశక్తి-సీతమ్మధార : సంగీతం, సాహిత్యం మనిషికి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయని విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం అక్కయ్యపాలెంలోని స్వరాలయ సింగింగ్ స్టూడియోలో వివిధ జిల్లాలకు చెందిన గాయకులతో రాగాల పల్లకి కలిసిపాడుదాం రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వి.వీరయ్య మాట్లాడుతూ, పాటను ఆలపించిన ప్రతి గాయనికీ అభినందనలు తెలిపారు. రచయిత కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ, వర్ధమాన గాయకులు ఒక చోట చేరి తమ ప్రతిభను చూపించడం ఎంతో శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య ఈవెంట్ అధినేత కూనా అనీల్‌కుమార్, గాయకులు పి.కృష్ణవేణి, రాహుల్ బాబు, లక్ష్మణ్‌రాజు, వివిధ జిల్లాలకు చెందిన గాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చింతపల్లి:అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి కార్యాలయం ఆవరణలో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్, (విశాఖపట్నం) సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక పాత్రికేయులు రక్తదానం చేశారు.

16న మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలం ప్రాంగణం లోని ఎంపిడిఒ కార్యాల యంలో ఈ నెల 16వ తేదీన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. మండల, గ్రామస్థాయి అధికారులు సంబంధిత సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నార్త్ షిరిడీ ఆలయంలో విశేష పూజలు


ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం దివి రంగబాబు, అనంతలక్ష్మి దంపతులు పెండ్లి రాట వేశారు. ఆలయ చైర్మన్ ట్రస్టీ వానపల్లి అప్పారావు, సీతారామకల్యాణ మహోత్సవ కమిటీ సభ్యులు బుడ్డిగ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యాన పూజలు జరిగాయి. బుధవారం జరగనున్న కల్యాణ మహోత్సవంలో 150 మంది దంపతులు పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకున్నారని, ఇంకా ఆసక్తి ఉన్నవారు 15, 16 తేదీల్లోగా సంప్రదించవచ్చని ట్రస్ట్ పేర్కొంది.



కోటవురట్లలో బారులు తీరిన మందుబాబులు

అంబేద్కర్‌కు ఘన నివాళి

-వాడవాడలా జయంతి వేడుకలు



నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు చోట్ల ఘనంగా నివాళులు అర్పించారు. అనకాపల్లిలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు అంబేద్కర్‌కు పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

అనకాపల్లి : రాజ్యాంగ వైతాళికుడు అంబేద్కర్ మనకు ఇచ్చిన రాజ్యాంగం స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి టి.అజయ్ బాబు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎస్‌పి కె.వి.మురళీకృష్ణ పూల మాల వేసి, నివాళులు అర్పించారు అనకాపల్లి డిఎస్‌పి ఎస్.అప్పలరాజు, అనకాపల్లి టౌన్‌సిఐ జి.శంకరరావు, రూరల్ సీఐ ఎస్. ధనుంజయ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సిహెచ్.సంజీవరావు, అనకాపల్లి రూరల్ ఎస్సై జి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.


పట్టణంలోని భీమునిగుమ్మం, ఎంఎంసి కాలనీ, గవరపాలెంల్లో విగ్రహానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి సత్యవతి, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ నివాళులర్పించారు. వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మలసాల భరత్‌కుమార్ నివాళులర్పించారు. ఏపీఐడబ్ల్యూపి చైర్మన్ దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, మందపాటి జానకి రామరాజు, పెద్ది శెట్టి గోవింద, కార్పొరేటర్ జాజుల ప్రసన్న రమేష్, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి, కొణతాల భాస్కర్, న్ కె ఎం నాయుడు,విల్లూరి శివసూరి, ఆది ఆంధ్ర సంఘం సమ్మంగి కనకారావు, బెల్లానా అనురాధ, కటారి నూకరాజు, పాల్గొన్నారు. జీవీఎంసీ కార్యాలయం వద్ద అంబేద్కర్ పేరున ఎఎంసి కాలనీ రెల్లి కులస్తుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు.

స్థానిక కార్మిక కర్షక నిలయం దొడ్డి రామనాయుడు భవనంలో ఎపి పిటిడి జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. గవరపాలెం దాసరి గడ్డ రోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మల్ల సురేంద్రబొడ్డేడ జోగు నాయుడు,మల్ల శ్రీను,దూలం గోపి, తొత్తర అప్పారావు, గోవాడ రాజు, రామకష్ణ నివాళులర్పించారు. జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి లక్ష్మణ్, సురా శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు.

డైట్ కళాశాలలో కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు ఆధ్వర్యంలో,

టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు అంబేద్కర్ నగర్ గవరపాలెం లో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గోవాడ రాజు మద్ర జోగారావు బోడి వెంకటరావు కర్రీ మల్లేశ్వరరావు బొడ్డేడ మురళి విల్లూరి రమణబాబు గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

స్థానిక రామచంద్ర థియేటర్ దరి అంబేద్కర్ విగ్రహానికి



కశింకోటలో..



గొలుగొండలో...

కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసిసి ప్రధాన కార్యదర్శులు ఎం. కోటేశ్వర రావు, కె.సత్యనారాయణ(ఏడు కొండలు), అనకాపల్లి పార్లమెంట్ పరిశోధన సమన్వయకర్త బి.భాను మూర్తి యాదవ్, జిల్లా కార్యదర్శి కె. శ్రీధర్, సత్యనారయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్

ఎస్.రాజు(ఈశ్వర రావు), జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి.బాల మురళి పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక రెల్లి సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్నిమాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆవిష్కరించి, నివాళులర్పించారు. నాలుగు రోడ్ల కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి జనసేన పార్టీ మండల అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు నివాళులర్పించారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ ఎంపిటిసి మొల్లేటి కృష్ణ పాల్గొన్నారు.

కశింకోట :ఉగ్గినపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు ,ఉపసర్పంచ్ లక్కరాజు గోవింద, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అచర్ల గ్రామంలో టిడిపి నాయకులు నిమ్మదల సన్యాసి నాయడు, నైనంశెట్టి రమణ రావు, దొడ్డి నాగేశ్వరరావు , బంగార్యపేటలో టిడిపి నేతలు ఉల్లింగల రమేష్, మాజీ సర్పంచ్ చివ్వేటి గోవిందమ్మ, జనసేన నాయకులు కర్రి వెంకట సత్య నారాయణ, కర్రి గోవింద, బీజేపీ నేతలు పొన్నగంటి అప్పారావు, నర్సింగబిల్లి లో 20 మందికి దుప్పట్లు పంపిణి చేశారు సర్పంచ్‌లు కోన అరుణ నాగేశ్వరరావు, వికలాంగుల సంఘం నాయకులు ఎస్‌కె రెహమాన్,పాల్గొన్నారు.

చింతలపాలెం లో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరతకుమార్ నివాళులర్పించారు.

సబ్బవరం : మొగలిపురంలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి పూలమాల వేసి నివాళులర్పించారు. సబ్బవరం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నేతలు గండి రవికుమార్, కర్రి బాబు, సర్పంచ్ డి. ప్రసాదరావు, దళిత నేతలు దువ్వ దుర్గాలు, ఐడి బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాటజంగాలపాలెం సచివాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ పడాల వెంకటరమణ,సెక్రటరీ సుబ్బలక్ష్మి నివాళులర్పించారు మాజీ సర్పంచ్ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విద్యాలయంలోఅంబేద్కర్ జయంతిలో . ఎపి హైకోర్ట్ న్యాయమూర్తి ఎవి శేషసాయి పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సి పి, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ విశ్వచంద్ర నాథ్, కో కన్వీనర్ డాక్టర్. నిర్మలా దేవి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మ పాలెం పంచాయితీ, సమ్మంగిపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో అర్జిల్లి అప్పలరాజు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు సమ్మంగి అప్పారావు , అఖిల్, లోవరాజు,బొంది దుర్గారావు,చింతకాయల ముత్యాలు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి


కె కోటపాడు : మండల కేంద్రంలో రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, నన్నయ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ముర్రు ముత్యాల నాయుడు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి ఇల్లాకు రాము, సిపిఐ నాయకులు వేచలపు కాసుబాబు, గొర్లె దేవుడు బాబు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంపిపి రెడ్డి జగన్మోహన్, ఎస్ఐ లక్ష్మీనారాయణ , రెల్లి కుల సంక్షేమ



కోటవురట్లలో...

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి , సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని , ఎంపిటిసి బంగారి లక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం : లక్కవరంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పూలమాలలు వేసినివాళులర్పించారు. అంబేద్కర్ భవనంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో,. వాకర్స్ క్లబ్‌లో క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

బుచ్చయ్యపేట:మండలంలో బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు

వడ్డాది : స్థానిక ఎస్‌సి కాలనీలో అంబేద్కర్‌కు దళిత సంఘ యువజన అధ్యక్షుడు బూసికోట పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎల్‌బిపి అగ్రహారం, బంగారుమెట్ట రెల్లి వీధి జడ్పీ హైస్కూల్ వద్ద అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. చోడవరం టిడిపి ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, మాడుగుల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీను, పేరమ్మ ముత్యాల త్రివేణి, మెరుగు బాబురావు పాల్గొన్నారు

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట లో్కర్ 133 వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహనికి పలువురు గ్రామ నేతలు పాలాభిషేకం చేసి ఘనంగా నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా దాతలు సాయం ఏర్పాటు చేసిన సుమారు రూ 20 వేల విలువైన దుస్తులను పేదలకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ కె.లోవరాజు, పందల దేవ, జి.సత్యదేవ్, తలారి ఆదిమూర్తి, శీలం గోవిందరావు, శంకరరావు, దొరబాబు, కోట సత్తిబాబు, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరరావు, అంబేద్కర్ సంఘం సభ్యులు మల్లేటి రాజు, పూడి దేవ, బుల్లిబాబు, అప్పారావు, నాగరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట :అందరూ స్వేచ్ఛగా జీవించే హక్కులను రూపొందించిన ఏకైక వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కుందూరు రానా కొనియాడారు. స్థానిక హైస్కూల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాయకరావుపేట విలేకరులు ో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల విద్యాశాఖ అధికారి కాకాడ నాగేంద్ర గాంధీ కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. సాక్షి విలేకరు గణేష్ విలేకరులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. పూరిల్లు దగ్ధమైన బాధిత మహిళకు సీనియర్ పత్రికా విలేకరి గెద్దాడ ప్రసాద్ 25 కేజీల రైస్ బ్యాగ్ అందజేశారు. విలేకరు పల్లా ప్రసాద్, వెంకట్, వెంకటేష్, గబ్బర్ సింగ్ నాని, జ్యోతి రాజు, రామకష్ణ, సుభాని, ఈశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని నక్కపల్లి, కాగిత, డొంకాడ, జి జగన్నాథపురం గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, సర్పంచ్ జయ రత్న కుమారి, నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జ్ ఎలమంచిలి తాతబాబు, గోవింద్, తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పోలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని రత్నరపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బికే పల్లి గ్రామంలో ఎంపీటీసీ రాంబాబు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

అనకాపల్లిడెస్క్:అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ల అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీఎం జగన్ తన పరిపాలన కొనసాగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వడ్డాదిలో..